(సీరియల్ కథ)

# సుడిగాలిలో......
# దీపం!

* రచన: శ్రీ బుద్ధిరాజు నరసింహారావు. *

(గతసంచిక తరువాయి)

దీప కమల్‌ల వివాహం ఎంతో సాధారణంగా జరిగింది. పెరట్లో పందిరవేసి అగ్ని సాక్షిగా ప్రమాణం చేయించి పెద్దలు వారిని ఆశీర్వదించారు.

ఈ వివాహం వల్ల అందరికన్నా ఎక్కువగా సుందరం సంతోషించాడు, పుష్ప సంతోషించింది.

కాని చంద్రయ్య ఎంత ప్రయత్నించినా సంతోష పడలేక పోయాడు. లోలోన ఏదో తలచుకుని భయపడుతున్నాడు. బాబా భోలేనాథుడు అన్న మాటలు చెవుల్లో మారు మ్రోగుతున్నాయి.

పెళ్ళి పూర్తయిన తర్వాత...

శోభనం రాత్రి...

రెండు యువ జీవితాలు ఏకమయ్యే తొలిరేయి...

కమల్ మృదువుగా దీప చేయితాకుతూ "దీపా... చివరికి నిన్ను నేను పొందాను. ఆ రోజు టైపు ఇన్స్టిట్యూట్‌లో నిన్ను చూడగానే నాదాన్నిగా చేసుకోవాలనుకున్నాను" అన్నాడు.

దీప మౌనంగా కమల్ మాటలు వింటూ కూర్చుంది. ఏమనాలో అర్థం కావటం లేదు.

"ఏం దీపా... నేనంటే నీకిష్టం లేదా... నీకు సంతోషంగా లేదా మరేం నాతో అసలు మాట్లాడవే?"

"అ...అబ్బే...అలాగేం లేదే!" దీప గాభరా పడింది.

"మరేమిటలా ఆలోచిస్తున్నావు!"

"నాకెందుకో భయంగా వుంది"

"భయమా? ఎందుకు? ఓహో నేనంటే భయంగా వుంగా?" కమల్ చిలిపిగా నవ్వాడు.

"అంహం మీరంటే భయంకాదు మీకు మీకు తెలియదు. నన్ను వివాహం చేసుకోవడంవల్ల మీపై దుష్టగ్రహాలు ప్రభావం చూపిస్తాయని బాబాజీ చెప్పారు. అందుకు" దీప స్వరం వణికింది.

"దుష్టగ్రహాలా?" కమల్ అట్టహాసం చేసాడు, "ఆ దుష్టగ్రహాల ప్రభావం ఎలా వుంటుందో కాస్త వివరంగా చెప్పు డియర్!"

కమల్ స్వరంలో వ్యంగ్యం అర్థం చేసుకున్న దీప మెల్లిగా "ఆ దుష్టగ్రహాల ప్రభావం ప్రళయంగా మారి మీ జీవితాన్నే"

"బాగుంది... దీపా అదంతా పిచ్చి ఆలోచన. ఇది పురాతనకాలం కాదు. ఆధునిక యుగం. పిచ్చి ఆలోచనలకీ మూఢ నమ్మకాలకీ తావు లేదు. అసలీ బాబాజీల మాటలని నేనసలు నమ్మను నువ్వు నాభార్యవు అందుకే నా ఆలోచనలతో ఏకీభవించ మంటాను. అది సరేగాని ఈ పిచ్చి వాదనలతో ఈ మధురమైన తొలిరేయి వృధా చేయకు." అంటూ కమల్ చేయి ముందుకు చాపి టేబులు లేంపు ఆర్పేసాడు.

◆ ◆ ◆

దీప, కమల్‌ల వివాహం జరిగి పది రోజులు దాటాయి.

"వివాహమైన తర్వాత ఈ దినాలు ఎంత చక్కగా గడిచి పోతున్నాయి. ఈ తొలిరేయి ఎంత మధురమైనది, అద్భుతమైనది! ప్రతిక్షణం ఆలోచిస్తూ దీప తనువు పులకించేది, జీవితాంతం ఈ దినాలు ఇలాగే చక్కగా, హాయిగా, గడిచిపోతే ఎంత బాగుంటుంది? అలాగైతే నిజంగా తన జీవితం సఫలమౌతుంది, చిన్ననాటి నుండి తననుభవించిన బాధలన్ని ఇట్టే మరచి పోగలదు!

ఎంతో మధురంగా ఆనందంగా గడిచి పోతున్నాయి రోజులు.

కాని ఆ రోజు...

ఎందుకో ఆరోజు ఆమె మనసు ఆందోళన చెందుతోంది. ఏదో అజ్ఞాత ఆలోచన ఆమె గుండె దడదడలాడేలా చేస్తోంది.

ఎందుకో ఆరోజు బాబాజీ అన్న వాక్యాలు గుర్తుకొస్తున్నాయి, "దుష్టగ్రహాల మహాశాంతి అత్యావసరం!"

ఆ రోజు ఇంట్లో ఏపనీ చేయడానికి మనసొప్పడం లేదు. చెయ్యాలికదా అని ఇంటి పనులు చేస్తోందిగాని ఏదో పోగొట్టుకున్నట్లు, తనువులో శక్తి లేనట్లు.

(సశేషం)